🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adiavi Nannaya University
☎ : 9701293231

చాళుక్య ద్వారము

తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య బట్టుగంగారావు
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 4 | 26-10-2020 | పుటలు:4


# ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం - రాజమహేంద్రవరం



## ప్రారంభ - వికాసాలు





ఆచార్య మొక్కా జగన్నాథరావు, వైస్ ఛాన్సలర్



ఆచార్య బట్టు గంగారావు, రిజిస్ట్రార్

**సింధువును చేరి బిందువు సింధువగును !**

**ధ్యేయమును బట్టి ప్రతిపని దివ్యమగును !!**

అవును. సంకల్పశుద్ధి సమున్నత కార్యాలకు పునాది. ఏప్రిల్ 22 - 2006 . ఆరోజు ప్రపంచ ధరిత్రీ దినోత్సవం. ఉభయ గోదావరి జిల్లాల ప్రజల మనసులు ఉప్పొంగేలా, సంతోషించేలా విద్యార్థి లోకానికి సమ్మోహనం కలిగేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని రాజమహేంద్రవరంలో ఆదేరోజు స్థాపించింది. నాటి ముఖ్యమంత్రివర్యులు డా॥ వై. యస్. రాజశేఖర రెడ్డి గారి అమృత హస్తాలతో, మంత్రివర్యులు శ్రీ జక్కంపూడి రామ్మోహన రావు గారి సత్సంకల్పంతో , గోదావరి విశ్వవిద్యాలయ సాధన సమితి సభ్యుల ఆశయంతో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న 115 ఎకరాల స్థలంలో శంకుస్థాపన జరిగింది. రాజానగరం మండలం వెలుగుబంద ప్రాంతం విద్యాపీఠానికి ఆవాసమైంది. చాళుక్య ద్వారంతో, తెలుగు కవిత్వానికి ఆద్యుడైన నన్నయ భట్టారకుని విగ్రహదర్శనంతో , రాజరాజ నరేంద్ర నగర్ గా తూర్పు చాళుక్యుల రాజ్యవైభవానికి ఒక ప్రతిబింబంగా దర్శనమిస్తుంది. 450 అనుబంధ కళాశాలలతో ఉభయ తెలుగు రాష్ట్రాలలో అతి పెద్ద విశ్వవిద్యాలయంగా సేవలందిస్తోంది.

### గోదావరి విశ్వవిద్యాలయ సాధన సమితి

గోదావరి జిల్లాలకు ఒక విశ్వవిద్యాలయం కావాలనేది ఎప్పటినుండో ఉన్న ఒక బలమైన కోరిక. సుమారుగా పదేళ్లపాటు ప్రయత్నం జరుగుతూనే ఉంది. భీమవరంలోని ప్రముఖ విద్యా ప్రదాత శ్రీ మింటే పద్మనాభం గారి అధ్యక్షతన నరసాపురం నుండి డా॥ చినమిల్లి సత్యనారాయణరావు గారు, కాకినాడ నుండి ' డా॥ చిరంజీవినీ కుమారి గారు, రాజమండ్రి నుండి శ్రీ వై. ఎస్ నరసింహారావు గారు, శ్రీ జాస్తి జనార్ధనరావు గారు, మలికిపురం నుండి శ్రీ మంగెన వేంకట సత్యనారాయణ మూర్తి గారు ,పెనుగొండ నుండి డా॥ తమ్మయ్య గారు మొదలైన ప్రముఖ విద్యావేత్తలు, కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్, మేధావి వర్గం గోదావరి విశ్వవిద్యాలయ సాధన సమితిగా ఏర్పడి ఉద్యమాన్ని నడిపించారు. గోదావరి జిల్లాలలో అన్ని కళాశాలల నుండి, ప్రాంతాలనుండి సమావేశాలు, సభలు, ర్యాలీలు నిర్వహించి ముక్తకంఠంతో నినదించారు. ఫలితంగా ప్రభుత్వం సద్భావనతో ఆలోచించింది. మేధావి వర్గానికి శ్రీ జక్కంపూడి రామ్మోహనరావు గారి రాజకీయ నాయకత్వం బలాన్నిచ్చింది. ఆయన నాటి ముఖ్యమంత్రి డా॥ వై. ఎస్ . రాజశేఖరరెడ్డి గారితో చర్చించారు. అపర భగీరథుడై ఒక తపస్సుగా విశ్వవిద్యాలయ సాధనకై కృషి చేసారు. ఫలితంగా సాధనసమితి ఉద్దేశాలు, ఆశయాలు నెరవేరాయి. విశ్వవిద్యాలయ స్థాపనకు అంకురార్పణ జరిగింది.



### ▶ ప్రారంభం :-

ఆచార్య చొప్పల రత్నంగారు స్పెషల్ ఆఫీసర్గా రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలోని భవనాలు, జయకృష్ణపురంలోని కొన్ని అద్దె భవనాల్లో విశ్వవిద్యాలయ కార్యనిర్వహణ ప్రారంభమైంది. ప్రారంభంలో మూడేళ్ళపాటు మొదటి ఉపకులపతిగా ఆచార్య కందుల నిరూపరాణి గారు ఆచార్య నియామకాల్ని చేసి కోర్సులు ప్రారంభించారు. 2011 లో కాకినాడ జె.ఎన్.టి.యుకి ఉపకులపతిగా ఉన్న ఆచార్య అల్లం అప్పారావు గారు నన్నయ విశ్వవిద్యాలయానికి రెండు మాసాలు ఇన్‌చార్జ్ వి.సి.గా ఉన్న సమయంలో వెలుగుబందలోని స్వంత స్థలంలో నన్నయ భట్టారకుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి రెండు గదుల కార్యాలయాన్ని నిర్మాణం కావించారు. ఇక్కడ ఈ నేలపై మొదటి సారిగా ఎం.ఏ. ఇంగ్లీషు , తెలుగు తరగతుల బోధన జరిగింది. 2012 లో ఉపకులపతిగా బాధ్యతలను చేపట్టిన ఆంధ్ర విశ్వవిద్యాలయ ఫిలాసఫీ ప్రొఫెసర్ పసలపూడి జార్జ్ విక్టర్ గారు 2012 లో ఉభయ గోదావరి జిల్లాలలోని కళాశాలలను నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలుగా తీసుకొచ్చారు. 2013 లో స్వంత స్థలంలో రోడ్లు, భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. చిరకాలం నీడనిచ్చే మద్రి, రావి, వేప చెట్లను రోడ్లకు ఇరువైపులా ఒక ప్రణాళికతో ప్రతి ఆచార్యుని చేత నాటించారు. 2014 లో విశ్వవిద్యాలయాన్ని రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల నుండి పూర్తిగా స్వంత స్థలంలోనికి తీసుకొచ్చారు. 2017 లో ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలు నాయుడు గారి సారధ్యంలో యు.జి.సి12 బి స్టేటస్ని సముపార్జించుకోవడంతో పాటుగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న కాకినాడ, తాడేపల్లిగూడెం పి.జి. సెంటర్లను నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోనికి తీసుకొని వచ్చారు.

### ▶ ప్రస్తుతం :-

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భూగర్భ శాస్త్ర ఆచార్యునిగా సుమారుగా మూడు దశాబ్దాలు విశేషమైన ప్రతిభా సేవలను అందించిన ఆచార్య మొక్కా జగన్నాథరావు గారు 2020 జనవరి 10 వ తేదీన నన్నయ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా బాధ్యతల్ని చేపట్టారు. తక్షణమే విశ్వవిద్యాలయానికి నేక్ మరియు ఐ.ఎస్.ఓ గుర్తింపులను తీసుకుని రావడానికి సంబంధించిన కార్యాచరణలో నిమగ్నమై విశ్వవిద్యాలయాన్ని బోధన, పరిశోధనల్లో మెరుగైనదిగా తీర్చిదిద్దే పనిలో కృషి చేస్తున్నారు. 2020 జనవరి 25న ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో ఆచార్యులుగా ప్రసిద్ధులైన బట్టు గంగారావు గారు రిజిస్ట్రార్ గా బాధ్యతలు చేపట్టి విశేష సేవలందిస్తున్నారు.

### ▶ విశ్వవిద్యాలయ కళాశాలలు :-

ఆర్ట్స్ మరియు కామర్స్ కళాశాలలో 9 కోర్సులు, సైన్స్ మరియు టెక్నాలజీ కళాశాలలో 12 కోర్సులు, ఇంజనీరింగులో 4 విభాగాలు, విద్యాకళాశాలలో 2 విభాగాలు, కానవరం యోగా సెంటర్ అనుబంధంతో యోగ విజ్ఞానంలో ఒక ఏడాది, డిప్లమా కోర్సులు ఉన్నాయి. ఈ ఏడాది యు.జి.సి సౌజన్యంతో మరికొన్ని పి.జి. డిప్లమా కోర్సులు ప్రారంభం కానున్నాయి.

### ▶ పి.జి. సెంటర్లు :

కాకినాడలోని మల్లాడి సత్యలింగం నాయకర్ (ఎం.ఎస్.ఎన్) పి.జి సెంటర్ 7 కోర్సులతో, తాడేపల్లిగూడెం పి.జి సెంటర్ 5 కోర్సులతో విద్యాసేవల్ని అందిస్తున్నాయి.

మిగిలినవి.. 2లో..

## సంపాదకీయం

# ఆకాంక్ష



**'సావిద్యాయా విముక్తయే '**

ఏది విముక్తిని ఇస్తుందో అదే విద్య అన్నారు పరాశర మహర్షి. విముక్తి అంటే మోక్షం అని అందరూ అనుకుంటారు. నిజానికి మోక్షం అందరికీ కావలసిందే. అది కూడా పరిపూర్ణంగా బ్రతికిన తర్వాత. కానీ అసలు కావలసింది – ఈ లోకంలో బ్రతికినంతకాలం బాగా బ్రతకడానికి తోడ్పడే విద్య.

చదువు అభివృద్ధికి చిహ్నం. దానిని జీవన స్రవంతిగా సమాజం భావిస్తుంది. అది సమగ్రంగా సమన్వయ పూర్వకంగా నియంత్రింపబడినప్పుడు విద్యార్థి జీవనసరళి మారిపోతుంది. విద్యార్థి సర్వాంగీణ వికాసమే బోధన పరమార్థం. దానికోసం తమ ప్రాంతంలో ఒక విశ్వవిద్యాలయం ఉండాలని ఆశించడం పరమోత్తమమైన ఆకాంక్ష !

ఆది ఈనాటిది కాదు. విశాఖపట్నం తమకు దూరమై ప్రయాణ శ్రమ కలుగుతుందని ఏనాడు గోదావరి జిల్లాల ప్రజలకు అనిపించిందో ఆనాడే తమకొక గోదావరి విశ్వవిద్యాలయం కావాలనేకోరికకు బీజం పడింది. కళాశాలల నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజలు తమ ఆకాంక్షనుఏలిన వారికి వెలిబుచ్చారు. దానికొక సాధన సమితి ఏర్పడింది. మేధావులు , రాజకీయనాయకులు తోడయ్యారు. ఒక ఉద్యమం ప్రారంభం అయింది. ఉద్యమం అంటే తిరుగుబాటు కాదు. 'ప్రయత్నం'.

ప్రయత్నానికి మించినది ఈ ప్రపంచంలో మరొకటేముంది. తెలుగునాట ఇరవయ్యొకటవ శతాబ్ది ప్రారంభం కొత్త విశ్వవిద్యాలయ స్థాపనకు శుభారంభమైంది.

గోదావరి విశ్వవిద్యాలయ సాధనసమితి ఉద్యమం ఫలించింది. ఎక్కడ స్థాపించాలనే మీమాంస మొదలైంది. గోదావరి జిల్లాలకు కేంద్రస్థానం, ఆంధ్రుల సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రి అన్ని విషయాలకి కూడలి. పవిత్ర గౌతమీ తీరం తెలుగు మహాభారత రచనకు ఆధారమై నిలచింది. నన్నయ భట్టారకుడు నడయాడిన నేల విశ్వవిద్యాలయ స్థాపనకు ఎదురు చూసింది. నాటి తెలుగు ప్రజల అభిమాన నేత సంప్రదాయమైన పంచెకట్టును సవరిస్తూ తనకుకుడిభుజంగా నిలచిన స్థానిక ప్రజాసేవకుని భుజంపై చేయివేసి ' రామ్మోహన రావు ! నీ కోరిక ప్రకారమే, ఈ గోదావరి జిల్లాల ప్రజల కోసమే, నువ్వన్నట్లుగానే ఇక్కడే ఈ రాజమండ్రిలో విశ్వవిద్యాలయాన్ని నన్నయ పేరుమీదుగా ఏర్పాటు చేద్దాం' అని పలికిన మాట అక్షర సత్యమైంది. 2006 సంవత్సరంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది.

*డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారికి గోదావరి జిల్లాల ప్రజలు అభిమాన నీరాజనాన్ని అర్పించారు. శ్రీ జక్కంపూడికి గుండెల్లో గుడి కట్టుకున్నారు.*

ఎంత గొప్ప సన్నివేశం ! ఎంత గొప్ప దృశ్యం !

ఎంత గొప్ప ఉద్యమం ! మహెూన్నతమైన ఫలితం !!

**'సర్వత్ర విద్యయా వర్ధతే ప్రజా'**

మేలైన బోధనతో, సమున్నతమైన పరిశోధనలతో, కర్తవ్య నిష్ఠతో,
శ్రేష్ఠమైన వర్తనతో విద్యార్థి గణాన్ని
తీర్చిదిద్దే మన పరిశ్రమయే ఆ ఇరువురి నాయకులకు
మనమిచ్చే నిజమైన **నివాళి** !!

# ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

## 2006 నుండి వైస్ ఛాన్స్‌లర్‌లు (ఉపకులపతులు)



1.ఆచార్య కందుల నిరూపరాణి
పూర్తిస్థాయి బాధ్యతలు
ఆంగ్లశాఖ – ఆంధ్ర విశ్వవిద్యాలయం



2. ఆచార్య బీలా సత్యనారాయణ
ఇన్‌చార్జ్
వి.సి. ఆంధ్ర విశ్వవిద్యాలయం



3. ఆచార్య అల్లం అప్పారావు
ఇన్‌చార్జ్
వి.సి.జె.ఎన్.టి.యు కాకినాడ



4. శ్రీ ఎమ్.జి గోపాల్, ఐ.ఏ.ఎస్
ఇన్‌చార్జ్



5. డా॥ డి. సాంబశివరావు, ఐ.ఏ.ఎస్
ఇన్‌చార్జ్



6. శ్రీ ఎమ్.జి గోపాల్, ఐ.ఏ.ఎస్
ఇన్‌చార్జ్




7. ఆచార్య పసలపూడి జార్జ్ విక్టర్
పూర్తిస్థాయి బాధ్యతలు
తత్వశాస్త్ర విభాగం–ఆంధ్ర విశ్వవిద్యాలయం



8. ఆచార్య ఇ.ఎన్. ధనుంజయ రావు
ఇన్‌చార్జ్
రిజిస్ట్రార్ – నన్నయ విశ్వవిద్యాలయం



9. ఆచార్య ముద్రు ముత్యాలు నాయుడు
పూర్తిస్థాయి బాధ్యతలు
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం



10. ఆచార్య ఎస్. రామకృష్ణారావు
ఇన్‌చార్జ్
కృష్ణా విశ్వవిద్యాలయం



11. ఆచార్య ఏ.వి. ప్రసాదరావు
ఇన్‌చార్జ్
రాయలసీమ విశ్వవిద్యాలయం



12. ఆచార్య పి. సురేష్ వర్మ
ఇన్‌చార్జ్
రెక్టార్ – నన్నయ విశ్వవిద్యాలయం



13. ఆచార్య మొక్కా జగన్నాథరావు
ప్రస్తుతం పూర్తిస్థాయి బాధ్యతలు
భూగర్భ శాస్త్ర విభాగం
ఆంధ్ర విశ్వవిద్యాలయం

## 2006 నుండి రిజిస్ట్రార్లు (కులసచివులు)



1. ఆచార్య ఎ. నాగేశ్వర రావు



2. ఆచార్య ఎస్. భార్గవ రామ్మోహనరావు



3. ఆచార్య డి.ఎస్.వి.వి.డి.ప్రసాద్



4. ఆచార్య కె. రఘుబాబు



5. ఆచార్య ఇ. ఎన్ ధనంజయరావు



6. ఆచార్య కె. శ్రీ రమేష్



7. ఆచార్య ఎ. నరసింహారావు



8. డా॥ టి. మురళీధర్



9. ఆచార్య టి. అశోక్



10. ఆచార్య ఎస్ . టేకి



11. ఆచార్య బట్టు గంగారావు
ప్రస్తుత కులసచివులు

## గోదావరి విశ్వవిద్యాలయ సాధన సమితి

(వివిధ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్ మరియు విద్యావేత్తలు )

1. శ్రీ మెంటే పద్మనాభం – రాజ్యసభ సభ్యులు(మాజీ) భీమవరం
2. డా॥ టి. చిరంజీవినీ కుమారి – కాకినాడ
3. డా ॥ కె. రామచంద్రరాజు – పెనుగొండ
4. శ్రీ ఎమ్ . వి.వి. సత్యనారాయణ – గొల్లల మామిడాడ
5. శ్రీ పోతుల విశ్వం – కాకినాడ
6. శ్రీ గోకరాజు వేంకట నరసింహరాజు – భీమవరం
7. డా॥ చినమిల్లి సత్యనారాయణ రావు – నరసాపురం
8. శ్రీ తేతలి ఆదిరెడ్డి ( కొండబాబు) – అనపర్తి
9. శ్రీ మాగంటి సుభాష్ చంద్రబోస్ – ఏలూరు
10. శ్రీ మంగెన వేంకట సత్యనారాయణ మూర్తి – మల్కిపురం
11. శ్రీ వి . సీతారామరాజు – కాకినాడ
12. డా॥ ఎమ్ . రంగారావు – తాడేపల్లి గూడెం
13. శ్రీ అద్దేపల్లి శ్రీధర్ – రాజమహేంద్రవరం
14. శ్రీ అలుగు ఆనంద శేఖర్ – జంగారెడ్డి గూడెం
15. ఆచార్య బి . జనార్దనరెడ్డి –భీమవరం
16. డా॥ జి . తమ్మయ్య – పెనుగొండ
17. శ్రీ ఎస్ . కోటేశ్వర రావు – ఏలూరు
18. శ్రీమతి కె. అరుణ – తణుకు
19. డా॥ కోరుకొండ వేంకటస్వామి – రాజమహేంద్రవరం
20. శ్రీమతి ఎ. లలితా దేవి – నరసాపురం
21. శ్రీ వై .ఎస్ నరసింహారావు – రాజమహేంద్రవరం
22. శ్రీ జాస్తి జనార్ధన మూర్తి – రాజమహేంద్రవరం
23. శ్రీ చావా రామకృష్ణ – శాసన సభ్యులు(మాజీ ) – నల్లజర్ల




## విద్యాసంవత్సరం ప్రారంభంపై వీడియో కాన్ఫరెన్స్




**మీడియా సెల్, 23.10.20:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 2020–21 విద్యా సంవత్సరం ప్రారంభంపై ఉన్నత విద్యా శాఖ వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించింది. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రిన్సిపాల్ చీఫ్ సెక్రటరీ సతీష్ చంద్ర ఐఎఎస్, యాప్షీ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి మరియు అన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతులు, రిజిస్ట్రార్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో 2020–21 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ, పీజీ ప్రవేశాలను గురించి చర్చించడం జరిగింది. కోవిడ్ 19 నిబంధనలు పాటిస్తూ నూతన విద్యాసంవత్సరానికి అవసరమైన ప్రణాళికలను సూచించారు. అలాగే ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్, ఈ ఆఫీస్ విధానం తదితర అంశాలను చర్చించారు. కళాశాల ప్రారంభానికి తీసుకోవల్సిన జాగ్రత్తలు, విద్యార్థులకు వసతీ గృహాల ఏర్పాట్లు, తరగతుల నిర్వహణ విధానాలు వంటి పలు అంశాలను ప్రస్తావించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో నూతన విద్యా సంవత్సర ప్రణాళిక సిద్ధం కానుంది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.చంద్రకళ, ఇంజనీర్ ప్రేమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

## తిలక్ అంతర్జాతీయ అంతర్జాల సదస్సు విజయవంతం

**నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు**
**నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు**
**నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు...**

అని తన కవిత్వం ద్వారా తెలియజేసిన ఆధునిక తెలుగు కవి దేవరకొండ బాలగంగాధర తిలక్. అమృతం కురిసిన రాత్రి వారి ప్రసిద్ధ కవితా సంకలనం. వారి సమగ్రమైన రచనలు గురించి మూడు రోజుల పాటు అంతర్జాతీయ అంతర్జాల సదస్సును ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ మరియు మహర్షి సాత్యవతేయ విజ్ఞాన పరిషత్తు అయితంపూడి సంయుక్త ఆధ్వర్యంలో 24 నుండి 26 తేదీలలో నిర్వహించారు. దీనికి కన్వీనర్లుగా ఆచార్య రంకిరెడ్డి రామమోహనరావు, డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్ లు వ్యవహరించారు. వెబినార్ మరిన్ని విశేషాలు వచ్చే సంచికలో..

## నన్నయ సూక్తి నిధి

**రాజకులైక భూషణుఁడు, రాజమనోహరుఁడన్యరాజతే**
**జోజయశాలి, శౌర్యుఁడు, విశుద్ధ యశశ్శరదిందు చంద్రికా**
**రాజిత సర్వలోకుఁడపరాజిత భూరి భుజాకృపాణ ధా**
**రాజల శాంత శాత్రవపరాగుఁడు రాజమహేంద్రుడున్నతిన్**

**(మహాభారతం 1-1-3)**

చంద్ర వంశానికి ముఖ్యాలంకారమైనవాడు, చంద్రుని వలె అందమైనవాడు, పరరాజుల పరాక్రమాన్ని జయించడం చేత ప్రకాశించే శౌర్యం కలవాడు, నిర్మలమైన కీర్తి అనే శరత్కాల చంద్రుని చేత ప్రకాశింప చేయబడిన సమస్తలోకాలు కలవాడు, ఓటమి ఎరుగని దీర్ఘమైన బాహువులయందు ఖడ్గవాదర అనే నీటిచేత శత్రుధూళిని అణచినవాడు – **రాజరాజ నరేంద్రుడు**

**(ఇది నన్నయ మొదటి తెలుగు పద్యం.**
**రాజరాజ నరేంద్రుని ఔన్నత్యాన్ని ప్రస్తావించిన సందర్భం )**

# పరిశోధన మార్గదర్శి నన్నయ




## స్ఫూర్తి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం భారతదేశంలోని అన్ని విశ్వవిద్యాలయలలో అంతర్జాతీయ ప్రామాణిక విశ్వవిద్యాలయం. ఇది గ్లోబల్ ఖ్యాతి కోసం విద్యార్థులకు అవసరమైన అన్ని అధునాతన లక్షణాలను కలిగి ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉండటం రాష్ట్రప్రజల అదృష్టం. ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కేంద్రంగా ఉంటూ గోదావరి ప్రజలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతుంది. ఆదికవి నన్నయ అనేది కేవలం విశ్వవిద్యాలయం మాత్రమే కాదు ఇది ఒక చిన్న సమాజం. ఇది విద్యార్థుల నైతిక అభివృద్ధికి సహాయపడుతుంది. విశ్వవిద్యాలయం క్యాంపస్ లోని పాఠ్యాంశాలు ప్రపంచ విద్యకు అనుకూలంగా ఉంటాయి. ప్రతి విభాగంలో నాణ్యమైన విద్యకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విశ్వవిద్యాలయం వనరులు, వసతులతో పాటు అధ్యాపకుల బోధనకు ప్రత్యేక స్థానం ఉంది.

నేను ఏప్రిల్ 2012 లో జువాలజీ విభాగంలో ఎంఎస్సీ చేసాను. జీవశాస్త్ర విభాగంలో మా గురువులుగా డా.ఎ.మట్టారెడ్డి, డా.రమణేశ్వరి, డా.కళ్యాణి, డా.విజయనిర్మల ఉన్నారు. వీరి మార్గదర్శకంలో మా ఆలోచనలను, మా ఆశయాలను మేము సాధించాము. జీవితంలో ఎలాంటి సవాళ్ళనైనా ఎదుర్కొవడానికి నాలో ఉన్న బలాన్ని నాకు తెలిసేలా చేసారు. డా.ఎ.మట్టారెడ్డి, డా.రమణేశ్వరి నాకు జీవశాస్త్రాన్ని కొత్త డైమెన్షనల్ పద్ధతిలో నేర్పించారు. డా.ఎ.మట్టారెడ్డి చిన్న గ్రామాల నుండి వస్తున్న మరియు వారి కెరీర్ గురించి పెద్ద కలలు కనే నాలాంటి విద్యార్థులను ఎప్పుడూ ప్రోత్సహిస్తూ ఉండేవారు. జీవశాస్త్రంలో నా జ్ఞానాన్ని అభివృద్ధి చేసి నాకు కొత్త దృష్టిలో జీవశాస్త్రాన్ని చూపించారు. మాలిక్యులర్ బయాలజీలో పరిశోధన చేయడానికి సార్ నన్ను ప్రేరేపించారు. పరిశోధనలో నాకు సందేహాలు ఉన్నప్పుడు నాకు సహాయం చేసారు. అలాగే విశ్వవిద్యాలయ క్యాంపస్ వాతావరణం స్నేహపూర్వకంగా ర్యాగింగ్ లేకుండా సీనియర్లు, జూనియర్లు మధ్య భేదాభిప్రాయాలు లేకుండా ఆనందంగా ఉండేది. యుఎస్.ఎ లో పోస్ట్–డాక్టోరల్ స్కాలర్ అయిన నా సీనియర్ విద్యార్థి డా.బుజ్జిబాబు నా పరిశోధన పనిలో ఎల్లప్పుడూ నాకు మార్గనిర్దేశం చేస్తారు. నేను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుండి ఎంఎస్సీ డిగ్రీ పొందిన తరువాత నా లక్ష్యాన్ని వెతకటం మొదలుపెట్టాను. ఇప్పుడు నేను ఫార్మసీ విభాగంలో అలెర్జీ వ్యాధులపై పరిశోధన ద్వారా దక్షిణ కొరియాలో పిహెచ్.డి చేస్తున్నాను. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుండి పరిశోధనలపై మక్కువ ఉన్న విద్యార్థులు విజయాలను సాధించాలని నేను త్రికరణశుద్ధిగా కోరుకుంటున్నాను.

**పూర్వవిద్యార్థి, ప్రకాష్**
**ల్యాబ్ ఆఫ్ పాథోఫిజియాలజీ,**
**కాలేజ్ ఆఫ్ ఫార్మసీ,**
**సాహ్మ్యూక్ విశ్వవిద్యాలయం, సియోల్**

## జెస్టోర్ సేవలను ప్రారంభించిన వీసీ జగన్నాథరావు

**మీడియా సెల్, 20.10.20:**



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డా.బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయం సేవల అభివృద్ధిలో భాగంగా జె స్టోర్ సేవలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రారంభించారు. యూనివర్సిటీ ఈసీ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై జెస్టోర్ సేవలను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మానవ అవయవాలలో గుండె ఎంత కీలక పాత్రను పోషిస్తుందో విశ్వవిద్యాలయంలో గ్రంథాలయం అటువంటి పాత్రను పోషిస్తుందని అన్నారు. గ్రంథాలయ సేవలను అభివృద్ధి పరచడానికి ఇప్పటికే జెగేట్ సేవలను కొనుగోలు చేసామని తాజాగా జెస్టోర్ సేవలను అందిస్తున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయంలో విద్యాపరమైన ప్రగతికి ఇవి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. పరిశోధనలు, పరిశోధన పత్రాలు, జర్నల్స్, ఆర్టికల్స్, ప్రచురణలు, పాఠ్యాంశాలు వంటి అన్ని అంశాలను జె స్టోర్ ద్వారా పొందవచ్చునని చెప్పారు. దీనిలో లక్షాయాభైవేలకు పైగా ఆర్టికల్స్, ఐదువేలకు పైగా జర్నల్స్ ను సద్వినియోగం చేసుకోవచ్చునని తెలిపారు. ముఖ్యంగా 59 పాఠ్యాంశాలకు సంబంధించిన సమాచారం జె స్టోర్ ద్వారా పొందవచ్చునని అన్నారు. విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం క్యాంపస్ తో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ లకు చెందిన వారు దీనిని ఉపయోగించుకోవచ్చునని చెప్పారు. విశ్వవిద్యాలయ క్యాంపస్ లకు చెందిన అధ్యాపకులకు, పరిశోధకులు, విద్యార్థులు జెస్టోర్ కు సంబంధించిన ఐడిని గ్రంథాలయం నుండి పొందవచ్చునని తెలిపారు. జెస్టోర్ సేవలను అందరూ సద్వినియోగం చేసుకొని మంచి పరిశోధకులుగా ఎదగాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, లైబ్రరీ కోఆర్డినేటర్ డా.కె.రమణేశ్వరి, ఈసీ మెంబర్లు ఆచార్య కె.శ్రీరమేష్, డా.బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, డీన్స్ ఆచార్య.వై.శ్రీనివాసరావు, డా.ఎ.మట్టారెడ్డి, ఆచార్య పి.సురేష్ వర్మ, ఆచార్య ఎస్.టేకి, డా.టి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

### మంచి మాట

**ఆచినోతిచ శాస్త్రార్థ**
**మాచారే స్థాపయత్యపి ।**
**స్వయ మాచరతే యస్మాత్**
**ఆచార్య స్తేన చోచ్యతే ॥**

శాస్త్ర అధ్యయనం వలన దాని అర్థాన్ని తెలుసుకొని, దానికి అనుగుణంగా ప్రవర్తిస్తూ , దానిని ఇతరుల చేత ఆచరింప చేయువాడే **ఆచార్యుడని** చెప్పబడుచున్నాడు.

# నన్నయ సెట్ ఫలితాలు విడుదల

**అమ్మాయిలదే అగ్రస్థానం**
**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**

**మీడియా సెల్, 21.10.20:** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పీజీ ప్రవేశాల కొరకు నిర్వహించిన "నన్నయ సెట్-2020" పరీక్షా ఫలితాలలో అమ్మాయిలే అగ్రస్థానంలో నిలిచారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో బుధవారం నన్నయ సెట్ 2020 పరీక్షా ఫలితాలను వీసీ విడుదల చేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నన్నయ సెట్ 2020 పరీక్షలను ఈ నెల 16వ తేది నుండి 19వ తేది వరకు నిర్వహించామని అన్నారు. నన్నయ సెట్ కొరకు 6810 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 85 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరై ర్యాంకులను సాధించారని చెప్పారు. కోవిడ్ నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించామని తెలిపారు.
పరీక్ష కేంద్రాలను పెంచామని ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, విశాఖపట్నంతో కలిపి 10 నన్నయ సెట్ పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరిగాయని చెప్పారు. సోమవారంతో పరీక్షలు ముగిసాయని బుధవారం ఫలితాలను వెల్లడించామని అన్నారు. త్వరితగతిన ఫలితాలను అందించిన డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ బృందాన్ని వీసీ అభినందించారు. అనంతరం ఆయా పరీక్షల వారిగా మొదటి మూడు స్థానాలు సాధించిన వారి వివరాలను వీసీ వెల్లడించారు. లైఫ్ సైన్సెస్(101)లో ప్రథమ స్థానం వై.బిని రచెల్, ద్వితీయ స్థానం



నన్నయ సెట్ పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ

బి.సుప్రియగౌతమి, తృతీయ స్థానం జ్ఞానశ్రీ చంద్ర శరత్ మేర్ సాధించారు. ఫిజికల్ సైన్సెస్(102)లో ప్రథమ స్థానం టి.నాగజ్యోతి, ద్వితీయ స్థానం ఎస్.సత్య, తృతీయ స్థానం జి.సుమంత్ సాధించారు. మేథమెటిక్స్(103)లో మొదటి మూడు స్థానాలు ఎల్.హేమంత్ కుమార్, టి.నాగదేవి, వి.సింధుషా సాధించారు. కెమికల్ సైన్సెస్(104)లో మొదటి మూడు స్థానాలు కె.అర్పిత భవ్య, వి.లక్ష్మీ గణేష్, కె.హారిక వీర నాగ లక్ష్మీ సాధించారు. జియాలజీ(105)లో మొదటి మూడు స్థానాలు ఎం.రమేష్, ఎం.చిన్నంనాయుడు, వై.సత్యశిరీషా సాధించారు. కంప్యూటర్ సైన్సెస్(106)లో పి.వెంకటసాయిశరణ్, బి.హిందువెంకటదుర్గ, డి.దేవిప్రియ మొదటి మూడు స్థానాలను సాధించారు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(201)లో ఎల్.ఎస్.సౌమ్యఆచంట, సిహెచ్.సతీష్, జి.ప్రశాంతి మొదటి మూడు స్థానాలు సాధించారు. ఇంగ్లీషు(202)లో జి.బ్లెస్సీ హెప్సిబా, బి.గౌతమిమిశ్ర, వి.రాగమౌనిక మొదటి మూడు స్థానాలు సాధించారు. తెలుగు(203)లో డి.శ్రీలక్ష్మీదుర్గ, బి.విజయలక్ష్మీ, జె.సత్యసూర్యనాగ మొదటి మూడు స్థానాలను సాధించారు. హిందీ(204)లో వై.దేవిశ్రీచందన, పి.జోష్నారాణి, ఎల్.వన్షిక మొదటి మూడు స్థానాలు సాధించారు. ఎం.పి.ఈడీ(205)లో ఎస్.రాము, పి.హేమమాలిని, వి.సాయివెంకటనాయక్ లు మొదటి మూడు స్థానాలను సాధించారు. మొదటి స్థానాలలో నిలిచిన అభ్యర్థులకు విశ్వవిద్యాలయ అధికారులు అభినందనలు తెలిపారు. నవంబర్ మొదటి వారంలో నన్నయ సెట్ కౌన్సిలింగ్ ఉంటుందని తేదీలను త్వరలో ప్రకటిస్తామని వీసీ తెలియజేసారు. నన్నయ సెట్ పరీక్షలు వ్రాసిన అభ్యర్థులు ఫలితాలను యూనివర్సిటీ వెబ్ సైట్ www.aknu.edu.in ద్వారా తెలుసుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ డా.డి.జ్యోతిర్మయి, అసోసియేట్ డైరెక్టర్స్ డా.కె.వి.స్వామి, డా.కె.దీప్తి, ఈసీ మెంబర్లు ఆచార్య కొట్టి శ్రీరమేష్, డా.బి.జగన్మోహనరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫార్మాలో మరింత అభివద్ధి అవసరం

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**

**మీడియా సెల్, 20.10.20:** కోవిడ్ 19 వంటి వైరస్ లను ఎదుర్కొనే సామర్థ్యం గల మందులను తయారు చేయడంలో ఫార్మా రంగంలో మరింత అభివృద్ధి అవసరమని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లైఫ్ అండ్ హెల్త్ సైన్సెస్ మరియు ఫార్ముట్రెన్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ వెబినార్ ను నిర్వహించారు. ఫార్మా మరియు బయోటెక్ రంగాలలో ఆవరణలు మరియు వాగ్దానాలు అనే అంశంపై జరిగిన ఈ వెబినార్ కు విభాగాధిపతి డా.పి.విజయనిర్మల కన్వీనార్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. కోవిడ్ 19 కారణంగా ప్రపంచంలోని అన్ని దేశాలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్నాయని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు సైతం అవరోధాల దిశగా నడిచాయని అగ్రరాజ్యాలు వణికిపోయాయని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధిని సాధిస్తున్నామని చెప్పుకుంటున్న ఒక వైరస్ కారణంగా అభివృద్ధి ప్రమాణాలు శున్యంగా మారాయని చెప్పారు. కొవిడ్ 19 వంటి విపత్తును ఎదుర్కోవడంలో వైద్య, ఆరోగ్య, ఔషధ, శాస్త్ర రంగాలు పని చేస్తున్న ఆశించిన ఫలితాలను వెంటనే చూడలేకపోతున్నామని తెలిపారు. అంతరిక్షంలో ప్రయోగాలలో అభివృద్ధి చూస్తున్న నేటి కాలంలో ఔషదాల తయారిలో అభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఎంతో ఉందని గుర్తుచేసారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌజన్యంతో ప్రపంచంలోని అన్ని ఔషద తయారి సంస్థలను ఒక తాటిపైకి తీసుకువచ్చి కోవిడ్ వైరస్ కు త్వరితగతిన వ్యాక్సిన్ ను అందించాలని అన్నారు. అలాగే మానవ మనుగడకు ముప్పు చేకూర్చే కోవిడ్ వంటి మరి కొన్ని వైరస్ లకు సంబంధించిన వ్యాక్సిలను కూడా ముందుగానే సిద్ధం చేసుకోవాలని చెప్పారు. భవిష్యత్ లో బహుళ వైరస్ ల నివారణలకు సంబంధించిన ఔషధాలను తయారు చేయడంలో శాస్త్రవేత్తలు పరిశోధనలు జరపాలని తెలిపారు. తరువాత ఆంధ్రవిశ్వవిద్యాలయ కాలేజ్ ఆఫ్ ఫార్మస్యూటికల్స్ సైన్సెస్ ఆచార్యుడు జి.గిరిజా శంకర్ మాట్లాడుతూ బయో ఫార్మాస్యూటికల్స్ లోని సవాళ్ళు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, వక్తలు జి.ఎన్.వి.చంద్రశేఖరరెడ్డి, ఎం.ఎస్.సర్వేశ్వరరావు, జె.పి.శ్రీనివాసరెడ్డి, కె.తాతారావు, ఎ.మట్టారెడ్డి, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



## ఐ.క్యూ.ఎ.సి కార్యాలయాన్ని ప్రారంభించిన వీసీ

**మీడియా సెల్, 21.10.20:** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అంతర్గత నాణ్యత హామీ విభాగం(Internal Quality Assurance Cell) కార్యాలయాన్ని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు బుధవారం ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలోని కేంద్రపరిపాలన భవనంలో వీసీ మరియు రిజిస్ట్రార్ కార్యాలయాల మధ్య ఐక్యూఎసి ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపును సాధించే దిశగా ఐక్యూఎసి బదం పని చేయాలని చెప్పారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నాక్ గుర్తింపును త్వరితగతిన సాధించాలని తెలిపారు. విశ్వవిద్యాలయంలోని అన్ని నాణ్యత ప్రమాణాలు ఐక్యూఎసి పరిధిలోనికి వస్తాయని అన్నారు.
విద్యాపరమైన, పరిపాలనపరమైన, పరిశోధనపరమైన అన్ని అంశాల నాణ్యత ప్రమాణాలను ఐక్యూఎసి పరిశీలిస్తుందని తెలిపారు. దీనికి కోఆర్డినేటర్ గా ఆచార్య కె.శ్రీరమేష్, ఎగ్జిక్యూటివ్ కోఆర్డినేటర్ గా డా.కె.వి.స్వామి వ్యవహరిస్తారని అన్నారు. విశ్వవిద్యాలయ నాణ్యత ప్రమాణాలు పెంచే విధంగా ఐక్యూఎసి బందమంతా పని చేయాలని వీసీ సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఐక్యూఎసి కీలక పాత్రను పోషిస్తుందని అన్నారు. ఐక్యూఎసి బందానికి శుభాకాంక్షలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఈసీ మెంబర్లు ఆచార్య కొట్టి శ్రీరమేష్, డా.బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్స్ డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.కె.సుబ్బారావు, డీన్స్ డా.వై.శ్రీనివాసరావు, డా.ఎ.మట్టారెడ్డి, డా.డి.జ్యోతిర్మయి, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## సాంబశివరావు కుటుంబానికి ఆర్థిక సహాయం

**మీడియా సెల్, 23.10.20:** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తూ ఆకస్మిక మరణం పొందిన దేవరకొండ సాంబశివరావు కుటుంబానికి వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. యూనివర్సిటీ కంప్యూటర్ సెంటర్ లో సాంబశివరావు ఔట్ సోర్సింగ్ విధానంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తు ఇటీవల మరణించారు. సాంబశివరావు కుటుంబానికి ఆర్థికంగా సహాయం చేయాలనే ఆలోచనతో విశ్వవిద్యాలయ అధికారులు, ఆచార్యులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఒక రోజు వేతనంతో పాటు కొంత విరాళాన్ని అందించారు. ఈ మొత్తం సొమ్ము రూ. 225001 చెక్కు మరియు నగదు రూపంలో సాంబశివరావు భార్యకు వీసీ చేతుల మీదుగా అందించారు. విశ్వవిద్యాలయ సిబ్బంది అంతా ఒక కుటుంబంగా ముందుకు సాగాలని కష్టనష్టాలలో ఒకరికి ఒకరు సహకరించుకోవాలని రిజిస్ట్రార్ బట్టు గంగారావు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా.ఎ.మట్టారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్.లింగారెడ్డి, సిస్టమ్ మేనేజర్ వి.ఎ.ఎం.జ్యోతి, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు పాల్గొన్నారు.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్:- nannayavani@aknu.edu.in